

# వింత ప్రాణులు

సి. ఆనందారామం

ఏమి జనం!

తండోపతండాలుగా ఒకరినొకరు తోసుకుంటూ పోతున్నారు.

సగటు జనానికిదో సహజ లక్షణం.

పదిమంది ఎటు దారి తీస్తే అటు "ఏముందో?" నని వందల్లో – వేలల్లో జనం అనుసరిస్తారు.

ఒక్కరూ సొంతంగా ఆలోచించరు.

విషయాన్ని వివేచించుకోరు!

ఇది పరుగుల యుగం!

మొదట పరుగు తరువాతే ఏదైనా...

జనాన్ని చూసాడు, చిరంజీవి.

నోళ్ళన్నీ 'పరలోకం' 'దేవుడు' 'పశ్చాత్తాపం' 'ముక్తి' మొదలైన పదాలను పలుకుతున్నాయి. కానీ, కళ్ళలో తాత్త్విక చింతన లేదు. అవి అశాంతితో సంచలిస్తున్నాయి.

ఆశతో ఎటో చూస్తున్నాయి. ఆ ఆశలో 'దురాశ' రంగరించి వుంది. పలకరించే ప్రయత్నం చేసాడు.

"ఎక్కడికి వెళ్తున్నారు?"

"..........."

"ఎవరిని అనుసరిస్తున్నారూ?"

"ఎందుకు ఈ పరుగు? త్రొక్కిసలాట?"

ఎట్టకేలకు ఒక్కడు ఒక్క క్షణం ఆగాడు.

"గొప్ప మతం...కాగితం డబ్బులు! పర లోకం బంగారం! తళుకు తళుక్కుమనే బంగారం! ముక్తి! స్వర్గలోక ప్రాప్తి! అన్నీ.. కోరుకున్నవన్నీ వస్తాయి." పదాలు విరుస్తూ చెప్పాడు.

మనసులో తొందర మాటల్ని ముక్కలు చేస్తుంది. మళ్ళీ పరుగు!

మనిషి శ్రమకూ, కృషికీ ఫలితంగా వచ్చే సంపద ' ఊరికే' వస్తుందా?

ఈ రహస్య మేమిటో తెలుసుకోవాలి! ఏది తెలుసుకోవాలన్నా, కొంత తొక్కిసలాట తప్పదు.

ప్రతి ఒక్కడూ అన్నీ తనకే తెలిసినట్లు వ్యవహరిస్తున్నప్పుడు అసలు నిజం తెలుసుకోవటం ఎంత ప్రయాస?

జనం చూపులను అనుసరించి ముందుకు నడిచాడు. ఏవేవో కాళ్ళు తొక్కుతున్నాయి. మరేవేవో చేతులు తోస్తున్నాయి. అవి ఎదురుగా కొద్ది దూరంలో ఉన్నట్లు అనిపిస్తున్నాయి. సమీపించబోతే మళ్ళీ అంత దూరానికి పోతున్నాయి. రెక్కలున్నాయి. కానీ, ఎగరటం లేదు. ఎగిరే శక్తి గల ప్రాణులుగా లేవు! రెక్కలు కృత్రిమంగా అతికించుకున్నట్లుగా ఉన్నాయి. రకరకాల కాగితం నోట్లు! స్వదేశాలవీ, విదేశాలవీ...వాటి మీద ఎవరెవరివో బొమ్మలు! ఏవేవో అక్షరాలు! ఆ కాగితం నోట్లకు అతికించిన కాకి బంగారం రెక్కలు మిల మిల మెరుస్తున్నాయి.

చిరంజీవి శక్తిమంతమైన తన బైనాక్యులర్స్ తీసాడు. రెక్కలు పరీక్షగా చూసాడు.

కాకి బంగారం మెరుపుల పైన నల్లని అక్షరాలు! ఒక రెక్కపైన 'మతం' మరో రెక్కపైన 'దేవుడు'.

ఆ ప్రాణుల్లో మనిషి పోలికలు ఉన్నాయి. కాని, వెన్నెముక ఉన్న మనిషిలాగ నిటారుగా లేవు. నైతికంగా నిలవలేనట్లు, ముందుకు వంగి ఉన్నాయి. ఎగరటానికి చేస్తున్న విఫల ప్రయత్నం గెంతుగా మారింది. వాటిలో అవి ఏమిటేమిటో మాట్లాడుకొంటున్నాయి.

ఇది ఏ భాష? ఎవరీ ప్రాణి?

మనిషా? జంతువా? పక్షా?
ఏదైనా గ్రహాంతర జీవమా?
తన టేప్ రికార్డర్ తీసాడు చిరంజీవి.
ఆ ధ్వనులన్నీ రికార్డ్ చేసాడు.

తన లేబ్‌కి వచ్చాడు. రికార్డ్ చేసిన ధ్వనులను కంప్యూటర్‌కు ఫీడ్ చేసాడు. తెలుగులోకి డికోడ్ చేయమన్నాడు.

ఒక వికటాట్టహాసం!
అంతకు ముందు మాటలు ఏమిటో?

''సీత అబద్ధం. రాముడూ అబద్ధమే! కానీ, బంగారు లేడి మాత్రం నిజం కంటే నిజం! దాని చుట్టూ తిరుగుతోంది... ఈ
సృష్టి!''

''అదే మారీచుడు! పురుషుడుగా కాక ప్రకృతిగా చెప్పుకుంటే మరీచిక!''

''అందరూ...అందరూ..వెంటపడక తప్పదు.''

''ఈ జనాన్ని ముక్కలుగా చీల్చి, ఒకరి మీద ఒకరిని ఉసి గొలపటానికీ, మన వర్గం పెంచుకోవటానికీ, ఏదో ఒక పేరు! కులం, వర్గం, రాజకీయ పార్టీ ఏదో ఒకటి! అన్నింటికంటె బలమైనది మతం!''

''కొంత భయం! బోలెడు లాలస!''

''అందులోనూ కాగితం డబ్బుల్ని కాకి బంగారంతో మెరిపించే మతం అంటే మాటలా?''

''వెర్రి వాళ్ళని చేసి ఆకర్షిస్తుంది''

''రకరకాలుగా ఆత్మవంచన చేసుకుంటూ మన వెంటపడతారు!''

''అప్పుడు అందర్నీ మనరెక్కల కిందకి లాక్కోవాలి. మన బానిసలుగా, మరబొమ్మలుగా మార్చుకోవాలి!''

''ఏమీ శ్రమపడకుండా ఏ విధంగానూ ప్రయత్నించకుండా అన్ని సుఖాలూ వచ్చి వళ్ళో వాలాలని వీళ్ళ దురాశ. ఆ దురాశను ప్రేరేపిస్తూ కాగితం డబ్బు మధ్య మెరిసే కాకి బంగారంతో ఊరిస్తూ... వీళ్ళని పరమ సోంబేరులుగా జీవచ్ఛవాలుగా
మార్చాలి!''

''ఒక్కసారి సోమరితనం అలవాటయితే, మంచం దిగరు. పడుకుని పగటి కలలు కంటూ, ఆ కలల్లోనే అన్నీ సాధిస్తారు. దేనికోసమూ కృషి చెయ్యరు.''

''వీళ్ళందరినీ పేరాశాపాశాలతో లాగుతూ ఊబి బురదగుంటలోకి దింపాలి! లేవలేరు. బతకలేరు! చావలేరు! చచ్చినట్టు మనం చెప్పినట్లు చేస్తూ, తమ శ్రమ శక్తినంతా మనకు ధారపోస్తూ మనకు బానిసల్లా బతుకుతారు!''

ఇంక వినలేక పోయాడు చిరంజీవి.

ఈ అమాయక జనాన్ని ఆపాలి! ఎలా? సమాజంలో ఏ పెద్దమార్పయినా, మధ్యతరగతి మేధావుల నుండే రావాలి. పై
వర్గాల వారికి మార్పు అవసరం లేదు. వాళ్ళు అసలు ప్రయత్నించరు.

చిరంజీవి ఆలస్యం చెయ్యకుండా మధ్యతరగతి మేధావి వర్గాలను కలిసాడు. తనకు కంప్యూటర్ ఇచ్చిన డేటా వాళ్ళ ముందు ఉంచాడు. వాళ్ళు నవ్వారు.

''నీకిప్పుడు తెలిసిందా? మాకిదివరకే తెలుసు. మనం ఏం చెయ్యగలం?''

''కంచెలు విరగబడి చేలు మేస్తున్నాయి. మనం దిష్టి బొమ్మల్లా నిలబడినా, ఎవరు లక్ష్యపెడతారు?''

వాళ్ళ మాటలకు చిరంజీవి మనసులో నిరుత్సాహం నిండింది. అయినా దీక్ష సడలలేదు.

''అయితే, మీరెవ్వరూ రారా?''
చివరి ప్రయత్నం చేసాడు.

''ప్రయోజనం ఉండదు. అది బంగారం కాదు. బంగారంలా భ్రమింపచేస్తుంది'' అని చెప్పినా, కాకి బంగారపు మిలమిలల ఆకర్షణ నుంచి బయటపడరు. కాగితం డబ్బు మతులు పోగొడుతూంటే, మన బోధ ఎవరు వింటారు?''

''వాళ్ళు...అవి... ఆ వింత ప్రాణులు మన వాళ్ళనందరినీ ఊబిలోకి ఈడ్చుకుపోతున్నాయి.''

''రెక్కలతో ఎగిరే పక్షి 'జ్ఞాని' కి ప్రతీక. వాళ్ళు ఎగరలేరు. కృత్రిమ వేషం స్పష్టంగా తెలుస్తోంది. అయినా, రెక్కలుగా ఉన్న కాగితం డబ్బు ప్రలోభంనుంచి జనాన్ని బయటపడెయ్యటం చాలా కష్టం. మన మాటలు పట్టించుకోరు!''

''అయినా మనం ప్రయత్నించాలి! మళ్ళీ, మళ్ళీ, ప్రయత్నించాలి!''

''వింత ప్రాణుల వెనుక డబ్బూ, ఆయుధ బలమూ, సైనిక బలమూ ఉన్న పటిష్టమయిన వ్యవస్థ ఉంది. మన ప్రయత్నాల వల్ల లాభం లేదు.''

''మధ్య తరగతి మేధావులు ఇలా నిరీహులుగా ఉండిపోబట్టే, ప్రజావిద్రోహులు నిరాటంకంగా చెలరేగుతున్నారు. సరే! నేను ఒక్కణ్ణే వెళ్తాను.''

ఒంటరిగా బయలుదేరాడు చిరంజీవి.

మధ్యతరగతి మేధావులలో మధనం మొదలయింది. ఒక్కరొక్కరుగా ఒకరి తర్వాత ఒకరు వారూ కదిలారు.

అంతులేని జన సందోహానికీ– వింత ప్రాణులకీ అడ్డుగా చిరంజీవి నిలబడ్డాడు. జనంలో కొందరు హార్మనీలు మెడలో వేలాడేసుకుని, వాటిని వాయిస్తూ పాటలు పాడుతున్నారు. మరికొందరు మద్దెలలు వాయిస్తూ పల్లవి అందుకొంటున్నారు. ఇంకా కొందరు భక్తి పారవశ్యంతో స్టెప్స్ వేస్తూ డాన్సులు చేస్తున్నారు. కొందరు జంతికలు, చేగోడీలు కొనుక్కుని తింటూ మధ్యమధ్య వింత ప్రాణులకు నమస్కారాలు చేస్తున్నారు. కొందరు ఇతరులు తమని చూడకుండా, తువ్వాళ్ళు ముఖానికి అడ్డు
పెట్టుకుని రెక్కలుగా ఉన్న డబ్బు లెక్కపెడుతున్నారు.

రెండు చేతులూ జాపి నిలబడ్డ చిరంజీవిని చూసారు జనం!

తెల్లబోయారు. చిరాకుపడ్డారు! కోప్పడ్డారు!
చిరంజీవి అలాగే నిబడ్డాడు.

సముద్రాన్ని దాటడానికి సిద్ధంగా ఉన్న హనుమలాగా–
శిలువ మీదకు వెళ్ళే క్రీస్తులాగ–
అందరికోసమూ, ఒక్కడూ నిలబడ్డాడు.

''దయచేసి వినండి. ఈ వింత ప్రాణులను నమ్మకండి. కాగితం డబ్బుకీ, కాకి బంగారానికీ ఆశపడి, సర్వనాశనం కాకండి. మీరు నడుస్తున్నది ఊబి వైపు....


''మనకి ఎవ్వరూ ఎప్పుడూ, ఏదీ ఉచితంగా ఇయ్యరు. ఈ కాగితం డబ్బుకి బదులుగా మీరు మీ స్వాతంత్ర్యాన్నో, మీ వ్యక్తిత్వాన్నో, మీ ఆత్మనో ధారపొయ్యవలసి ఉంటుంది. కాసిని కాగితాల కోసం జీవచ్ఛవాలుగా మారకండి. వెనక్కు మళ్ళండి.''

జనానికి అతడి మాటలు పూర్తిగా అర్థం కాలేదు. అయోమయంగా ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

త్రొక్కిసలాటలో వెనకబడిన కొందరికి ''మీ ఆత్మను ధారపొయ్యవలసి ఉంటుంది'' అనే మాటలు భయం కలిగించాయి.

జనంలో తలెత్తిన సంధిగ్ధత చిరంజీవిలో మళ్ళీ ఆశను నింపింది. మరొక్క ప్రయత్నం చెయ్యాలనుకున్నాడు.

''సీతమ్మ అబద్ధం కావచ్చు. సీత అంటే నాగేటి చాలు! ఆ తల్లి భూతత్త్వ సంపదకు ప్రతీక ఈనాడు





అది క్షీణించి ఉండవచ్చు. రాముడు దూరమయి ఉండవచ్చు. రామతత్త్వం ఆనంద స్వరూపం. ఈనాడు ఆ ఆనందమూ 'మృగ్యమై' ఉండవచ్చును. కానీ, హనుమా! నువ్వు చిరంజీవివి. శబ్ద స్వరూపుడివి. శబ్దం ఈథర్‌లో శాశ్వతంగా ఉంటుందని సైన్స్ చెపుతోంది. సాధారణ శబ్దాలు ఒక దానితో ఒకటి కలగలిసిపోతాయేమో! బీజాక్షర సంపుటి మరొక ధ్వనితో కలిసిపోదు. అది ఈథర్‌లో శాశ్వతంగా ఉంటుంది. శబ్దతరంగాలు ప్రకటితమయ్యేదీ, వ్యాపించేదీ, వాయుతరంగాల ద్వారా! నేను ఒంటరిగా లేను. నా చుట్టూ మీరంతా ఉన్నారు. నాకు సహకరించండి'' అని మనసులో ప్రార్థించాడు.

''వెనక్కు మళ్ళండి మీకు ' ఉచితంగా' ఎవ్వరూ ఏదీ ఇవ్వరు'' అన్నాడు జనంతో.

''ఈ దేవుడు మాకు సంపదలు ఇస్తాడు''

''ఈ దేవుడు మాకు ఆరోగ్యం ఇస్తాడు.''

''ఈ దేవుడు చచ్చిపోయిన వాళ్ళని బ్రతికిస్తాడు...''

జనంలోంచి ఆశలు మాటలుగా బుసలు కొడుతున్నాయి.

చిరంజీవికి మతిపోతోంది.

''దేవుడు మీ మనసులో ఉన్నాడు. మీ ధ్యానంలో మీకు అందుతాడు. మీరు దేన్నయినా సాధించే శక్తి ఇస్తాడు.

ప్రలోభపెట్టేవి దెయ్యాలు. దేవుడు కాదు!''

జనంలో కలకలం!

గాలులు వేగంగా వీచాయి.

వింతప్రాణులు రెక్కలు అల్లల్లాడి అటూ, ఇటూ, ఊగాయి. అక్కడక్కడ రెక్కలు ఊడాయి.

''అవి దెయ్యాలు!''

వెనుకనుంచి ఎవరో అరిచారు.

''దెయ్యాలు! దెయ్యాలు!''

వందల, వేల స్వరాలు కలగలసి పలికాయి.

జనం ఒకరి నొకరు తోసుకుంటున్నారు.

ముందుకురావటానికి కాదు! వెనక్కు పరుగు తియ్యటానికి!

వింత ప్రాణులకి కోపం వచ్చింది.

అవి గిర్రున తిరిగి గుర్రుగా చూసాయి.

చిరంజీవిని ముక్కులతో పొడవబోయాయి.

''నాకు భయం లేదు. మా భగత్‌సింగ్ తన శిరస్సునర్పించాడు. భారతదేశ దాస్యానికి భరతవాక్యం పాడాలని! అల్లూరి సీతారామరాజు వింటినారి మ్రోగించాడు. అమాయకపు నిద్రలోంచి మన్నెం మేలుకుని గర్జించింది. నన్ను మీరు ఏం చేస్తేనేం? నా వాళ్ళంతా మీ వలలో పడకుండా వెళ్లిపోతున్నారు. అది చాలు నాకు!''

నెమ్మదిగా అక్కడికి చేరుకున్న మధ్య తరగతి మేధావులు ఇది చూసారు.

''అయ్యో! అవి మన చిరంజీవి మీదకి వస్తున్నాయి. అతడిని కాపాడుకోవాలి!''

త్వరత్వరగా చిరంజీవిని చేరుకున్నారు.

ఒక్కడే అనుకుని విజృంభించిన వింత ప్రాణులు కలిసికట్టుగా వచ్చిన వారిని చూసి వెనక్కు తగ్గాయి.

''అందరూ రండి. మనమంతా కలిసి పోట్లాడవలసిన సమయం ఇది! మనమంతా ఒక్కటైతే, ఇవి దెయ్యాలయినా మరేవయినా, మననేమీ చెయ్యలేవు. రండి!''

పిలుపునిచ్చాయి మేధావి వర్గాలు!

జనంలో ధైర్యం వచ్చింది.

''రండి! రండి!''

పిలుపులు ప్రతిధ్వనించాయి. ఒకరి చెయ్యి ఒకరుపట్టుకున్నారు. ఒకరికి మరొకరు ఆసరాగా నిలిచారు.

ముందుకు అడుగులు వేసారు.

---

## టైంలేదు

ప్రేమించడానికి టైం లేదంటోంది సోహా అలీఖాన్. షర్మిలా ఠాగూర్ ముద్దుల కూతురైన ఈ అమ్మాయి నాలుగైదు సినిమాల్లో నటించింది కాని, పాపం పేరు రాలేదు. అందుకే కొంతకాలం ఇటలీ వెళ్ళివచ్చింది. ఇప్పుడు 'షాదీ నెంబర్ వన్, రంగ్ దే బసంతి'లో యాక్ట్ చేస్తోంది. 'రంగ్‌దే'లో అమీర్‌ఖాన్ సరసన నటిస్తోంది. ''అమీర్ చాలా సరదా మనిషి, అతను బాగా నటించడమే కాదు, ఇతరులు బాగా నటించేలా గైడ్ చేస్తాడు. ఈర్ష్యాద్వేషాలు లేని నటుడు'' అని కితాబిస్తోంది సోహా.